హై లెవల్ బ్రిడ్జిలు నిర్మించండి

- పెద్దవాగు, తుమ్మలవాగులు ఉప్పొంగితే రాకపోకలు బంద్
- 11 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


గుండ్లరేవు - భేతాళపాడు నడుమ పెద్దవాగు ప్రవాహం

జూలూరుపాడు: వర్షాకాలంలో పడమటనర్సాపురం – భేతాళపాడు గ్రామాల మధ్యగల పెద్ద వాగు, తుమ్మలవాగులు, అన్నారుపాడు – గుండ్ల రేవు గ్రామాల మధ్యగల పెద్దవాగు ఉప్పొంగితే ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఆయా వాగులపై చప్టా, లోలెవల్ బ్రిడ్జిలు ఉన్నాయి. భారీ వర్షం వచ్చినప్పుడు వరదనీరు లోలెవల్ బ్రిడ్జిలు, చప్టాపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల పది రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో పలు గ్రామాలకు మండల కేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. పెద్ద వాగు, తుమ్మలవాగుపై హైలెవల్ బ్రిడ్జిలు, అలుగు వాగు లోలెవల్ బ్రిడ్జి లేకపోవడంతో 11 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భారీ, అతి భారీ వర్షాలు, ఎడతెరిపి లేకుండా వస్తే ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు వర్ణనాతీతం. ఇటీవల కురిసిన వర్షాలకు అలుగువాగు, తుమ్మలవాగులను ప్రజలు దాటకుండా ఉండేందుకు ట్రాక్టర్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు బందోబస్తు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందంటే వాగులు ఎంత ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇలాంటి ప్రమాదకరంగా ప్రవహించే వాగులపై రూ.లక్షలు ఖర్చు చేసి లోలెవల్ బ్రిడ్జిలు, చప్టాల నిర్మాణం వల్ల ఉపయోగం లేకుండా పోతోంది. వాగులు దాటే ప్రయత్నం చేస్తే మృత్యువును చేరుకోవాల్సిందే. ప్రమాదకరంగా ప్రవహించే వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలనే ఆలోచన అధికారులు, పాలకులకు రాకపోవడం బాధాకరమని బాధిత గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుమ్మలవాగు, పెద్ద వాగులపై హై లెవల్ బ్రిడ్జిలు, అలుగువాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు పీఆర్ ఏఈ జే. నాగేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా... తుమ్మలవాగు, పెద్దవాగులపై హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి



గుండ్లరేవు పెద్దవాగుపై హైలెవల్ బ్రిడ్జి, అన్నారుపాడు అలుగువాగుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మించాలి. కొద్దిపాటి వాన కురిస్తేనే పెద్దవాగు లోలెవల్ బ్రిడ్జిపై వరద ప్రవహిస్తుంది. ఏళ్ల తరబడి వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. వరద ఉధృతి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులు కొట్టుకపోయిన సందర్భాలు ఉన్నాయి.
– భూక్యా చంద్రబాబు, గుండ్లరేవు

ప్రమాదకరంగా ప్రవాహం



వర్షాకాలం భేతాళపాడు, పడమటనర్సాపురం మధ్యనున్న పెద్దవాగు, తుమ్మలవాగు ప్రమాదకరంగా ప్రవహిస్తాయి. ప్రస్తుతం లోలెవల్ బ్రిడ్జిలు ఉన్నా కొద్దిపాటి వర్షానికే పైనుంచి వరద ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వారం రోజులు పూర్తిగా ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. హై లెవల్ బ్రిడ్జిలు మంజూరు చేయాలి.
– గోపు రామకృష్ణ, భేతాళపాడు

ఎవరూ పట్టించుకోవడం లేదు



పెద్దవాగు, తుమ్మలవాగులపై లోలెవల్ బ్రిడ్జిల మీదుగా వరద ప్రవహిస్తోంది. దీని వల్ల భేతాళపాడు గ్రామ పంచాయతీ భేతాళపాడు, రాచబండ్లకోయగూడెం, గొల్లగూడెం, పీక్లా తండా, పంతులుతండా, టాక్యాతండా, చీపురుగూడెం, రేగళ్లతండాలు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.
– గుగులోత్ రాందాస్, సర్పంచ్ భేతాళపాడు

కేసీఆర్ నాయకత్వంలో మరింత అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించేందుకు సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ శాంతినగర్ గ్రామంలో 80 కుటుంబాలు బుధవారం బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అబివృద్ధి పథకాలు మెచ్చి పలు రాజకీయ పక్షాల నుంచి ప్రజలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. పులిగళ్ల మాధవరావు, దాస్యం ప్రమోద్‌కుమార్, జనగం కోటేశ్వరరావు, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, ఘాజీ, మంకిడి కృష్ణ, నందు, లష్కర్, బానోత్ కృష్ణ, బానోత్ శ్రీను పాల్గొన్నారు.

చేను పండాలి.. రైతు మురవాలి...
ప్రస్తుత వర్షాకాలం కొంత ఆలస్యంగా ప్రారంభమైనా చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వ్యవసాయానికి ఈ వాతావరణం అనుకూలంగా మారిందని.. అన్నదాతకు కొండంత ధైర్యాన్నిచ్చిందని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మండలంలోని మస్సివాగు గ్రామపంచాయతీ ధర్మారం తండా గ్రామ శివారులో వ్యవసాయ కూలీలతో కలిసి బుధవారం ఎమ్మెల్యే వరి నాటు వేశారు. మాట్లాడుతూ.. వ్యవసాయంపై మక్కువతో తాను అప్పుడప్పుడూ వ్యవసాయ పనులు కూడా చేస్తానన్నారు. స్వరాష్ట్రంలో ఉద్యమ నేత కేసీఆర్ సీఎంగా గద్దెనెక్కడం.. ప్రధానంగా అన్నదాతకు వరంలా మారిందన్నారు. అందుకే నేడు ప్రతిపల్లెలో వ్యవసాయం పండగలా మారందన్నారు. శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, మస్సివాగు ఎంపీటీసీ సుమలత పాల్గొన్నారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. బుధవారం పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం ఎమ్మెల్యే హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేసింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్యామ్, ఇ.రాజేష్ మాట్లాడుతూ.. ఇల్లెందు కళాశాలలో ఏళ్ల తరబడి హిస్టరీ సబ్జెక్టును సివిక్స్ అధ్యాపకుడు బోధిస్తున్నాడని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 406 ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఉండగా 24 కాలేజీలల్లో ఒకే అధ్యాపకుడు రెండు సబ్జెక్టులు బోధిస్తున్నట్లు చెప్పారు. తక్షణం అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకుని రావాలని కోరారు. అదేవిధంగా టెట్ నోటిఫికేషన్‌తో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే విధంగా చేయాలని కోరారు.

మైనార్టీలపై ప్రభుత్వం చిన్నచూపు


మాట్లాడుతున్న మహ్మద్ ఖాన్

ఇల్లెందు: రాష్ట్రంలో మైనార్టీలను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని కాంగ్రెస్ అనుబంధ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం ఇల్లెందులో జరిగిన మైనార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ పవర్స్ ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలను అణచివేస్తోందని ఆరోపించారు. 4శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అదే మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామన్న అంశం ఆచరణలో కార్యరూపం దాల్చలేదన్నారు. మైనార్టీ బంధు వర్తింపజేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మైనార్టీలంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. చీమల వెంకటేశ్వర్లు, షేక్ మసూద్, జలీల్, డానియేల్, పులి సైదులు, సుదర్శన్‌కోరీ, వెంకటనారాయణ, ఇబ్రహీం, ఖాలీద్, అక్తర్, సలీం, రజాక్, జానీమియా, మోహిన్, సమద్, జానీ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన

పాల్వంచరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కింద ఎంపికైన మండలంలోని తోగ్గూడెం గ్రామంలో నర్సరీలను, ఇంకుడు గుంతలను బుధవారం ఎంపీడీఓ బి.అప్పారావు, ఎంపీఓ బి.నారాయణ పరిశీలించారు. మాట్లాడుతూ.. పంచాయతీలను రాష్ట్ర బృందం పర్యటించనున్న దృష్ట్యా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ రంగా, గ్రామకార్యదర్శి బి.రవి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి పరిధిలోని ఎంసీఎచ్, జీజీహెచ్, మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనిల్, ఆది, సుగుణ, లక్ష్మి, కమల, శివారెడ్డి, శ్రీలక్ష్మి, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన


బోడు గ్రామంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వీరబాబు,

టేకులపల్లి: ప్రజలు విధిగా ఓటు హక్కుని వినియోగించుకోవాలని టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు, ఎంపీపీ భూక్యా రాధ అన్నారు. ఈ మేరకు బుధవారం ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. బోడు, పెట్రాంచెలక, ఆర్‌సీపేట, మొక్కంపాడు పంచాయతీల్లో ఈవీఎం, వీవీప్యాట్ పరికరాల గురించి తెలియజేశారు. ఓటు ఎలా వేయాలి, వేసిన ఓటు ఎలా, ఎక్కడ నిక్షిప్తం అవుతుంది తదితర వివరాలు ప్రయోగాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఓ కాళంగి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ జయకృష్ణ, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాలకు సామగ్రి

ఇల్లెందురూరల్: మండలంలోని 51 క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి మంజూరైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్రీడా ప్రాంగణానికి 23 రకాల వస్తువులను బుధవారం మండల పరిషత్ కార్యాలయాలకు చేర్చింది. రెండు రోజుల్లో అన్ని క్రీడాపాంగణాలకు సామగ్రి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
పాల్వంచరూరల్: మండలంలోని 36 గ్రామపంచాయతీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో క్రికెట్, వాలీబాల్ క్రీడలను ప్రోత్సహించేందుకు పంచాయతీకో కిట్‌ను మంజూరు చేసింది. వీటిని ఎంపీడీఓ కార్యాలయంలో నిల్వ చేశామని ఎంపీడీఓ అప్పారావు బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి షెడ్యూల్ రాగానే పంపిణీ చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ నిలిపివేత

జూలూరుపాడు: పాపకొల్లు, పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు జూలూరుపాడు విద్యుత్ శాఖ ఏఈ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


కుంటల్లలో పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని కుంటల్ల, కొండంగులబోడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. 69 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి యాంటీ లార్వా మరియు టీమోఫాస్ చల్లించడం స్పేస్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సీతమ్మ, వజ్జ పార్వతి, ఏఎన్ఎం పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ
నులిపురుగుల నివారణకు గాను ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి కందుల దినేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా వాయిదా వేయబడిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం ప్రభుత్వ ఆదేశానుసారం నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు వారందరికీ ట్యాబ్లెట్లు మింగించనున్నట్లు పేర్కొన్నారు.

కార్మిక గర్జనను జయప్రదం చేయండి

టేకులపల్లి: కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 4న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న కార్మిక గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నేత జరుపుల సుందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మద్రాస్ తండా గ్రామంలో బుధవారం కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జరుపుల లింగ, భూక్యా మంగి, మిచి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.
జూలూరుపాడు: ఈనెల 4న హైదరాబాద్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరగనున్న కార్మిక గర్జన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కేజీబీవీలో సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రాయల సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి అసెంబ్లీలో ప్రకటించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మి కులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు పెంచుతూ అసెంబ్లీలో ప్రకటించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వివిధ యూనియన్లను ఏఐటీయూసీ యూనియన్‌లో చేరిన వారికి కండువాలు కప్పి యూనియన్‌లోని ఆహ్వానించారు. మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశంలో సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించాలన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో చేసిన సమ్మె కారణంగా అనేక సమస్యలపై ఒప్పందాలు కుదిరాయని, ఈ ఒప్పందాలను అమలు చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వంగా వెంకట్, సత్యనారాయణ, క్రిష్టాఫర్, రమణమూర్తి పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న వీరభద్రం

టేకులపల్లి: విద్యారంగం, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చర్ల మండల కేంద్రంలో జూలై 25నుంచి ఆగస్టు 7వరకు తలపెట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర బుధవారం టేకులపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భయ్యా అభిమన్యు అధ్యక్షతన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ కేజీ నుంచి పీజీ ఉచిత విద్య ఊసేలేదన్నారు. రోజురోజుకు నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి కానీ, విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచడం లేదన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు మరింత దారుణంగా తయారయ్యాయని వాపోయారు. విద్యా సంస్థల్లో నెలకొన్న ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జరిగే సంఘర్షణ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గార్లపాటి పవన్ కుమార్, భూపేందర్, బోడా అభిమిత్ర, పాటల గోపి, నాగ కృష్ణ, వెంకటేష్, రామ్ చరణ్, ప్రవీణ్, పవన్, అనిల్, గణేష్ పాల్గొన్నారు.
జూలూరుపాడు: ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు విస్మరించారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ విమర్శించారు. బుధవారం జూలూరుపాడులో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారినట్లు చెప్పారు. సిద్ధు, అనిల్ కుమార్, రాజేష్, నరసింహారావు, రాకేష్, రామ్ చరణ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో బుధవారం 28వ రోజు గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా వీర్యా మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్మికులు ఉబ్బనిపల్లి నరేష్, ధనవంతరావ్, జి హరిసింగ్, బి నాగు, లక్ష్మి, రజనీ పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రీరామ రక్ష



కొత్తగూడెంటౌన్: పట్టణంలోని న్యూగొల్లగూడెం సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్ జి.ప్రమీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలే శ్రీరామ రక్ష అన్నారు. ఆగస్టు మొదటి వారంలో తల్లిపాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మల్లీశ్వరి పాల్గొన్నారు.
ఇల్లెందు: బిడ్డలకు తల్లిపాలు శ్రేష్ఠమైనవని 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కడకంచి పద్మ అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తకాలనీలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. సౌందర్యానికి ప్రాధాన్యం ఇచ్చే ఈ రోజుల్లో పిల్లల భవిష్యత్ కూడా అంతే ప్రాముఖ్యం అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు విజయ, నాగమణి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆయా, ఏఎన్ఎంలు విజయ, నిర్మల, ఆశా వర్కర్ లత పాల్గొన్నారు.

బలహీన వర్గాలను పట్టించుకోని అగ్రవర్ణాలు


మాట్లాడుతున్న శౌరి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో అగ్రవర్ణాలు అధికారం కోసం పాకులాడుతూ దళిత, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని ఐక్య వేదిక నాయకులు జేబీ శౌరి, కూసపాటి శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం తాటిపల్లి హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల నుంచి అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నారని, ఎమ్మెల్యే విషయంలో అందరూ సందిగ్ధంలో పడ్డారన్నారు. పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో అధికార పార్టీ నాయకులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ఏమయ్యాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొదటి విడత దళిత బంధు స్కీం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎవరికి చెప్తే వారికి ఇచ్చారని, ప్రస్తుతం నియోజకవర్గంలోని అర్హులకి, పేద జర్నలిస్టులకు దళితబంధు వర్తింపజేయాలని కోరారు. వాసం రామకృష్ణ, తాండ్ర వెంకటేశ్వర్లు, రాజేష్‌నాయక్, బొంకూరి పరమేష్, గుండా రమేష్, కొరం బుచ్చయ్య పాల్గొన్నారు.

'రైతుబంధు'ను అప్పు కింద జమ చేసుకోవద్దు

పాల్వంచరూరల్: రైతుల పంటల సాగుకు పెట్టుబడి కోసం ప్రభుత్వం చేపట్టిన రైతు బంధు పథకాన్ని బ్యాంకు అధికారులు తుంగలో తొక్కుతున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం సోములగూడెం పంచాయతీ కమ్మరిగూడెం గ్రామానికి చెందిన పలువురు రైతులతో కలిసి యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి మేనేజర్‌తో మాట్లాడి రైతులకు డబ్బులు ఇప్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వీరస్వామి, రాము, సోయం రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'తొలిమెట్టు'పై శిక్షణ


పాల్వంచ: మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరామ్మూర్తి

పాల్వంచ: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచడమే తొలిమెట్టు కార్యక్రమం లక్ష్యం అని పాల్వంచ మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో తొలిమెట్టు మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు చదవడం, రాయడం సామర్థ్యాలు, గణితంలో చతుర్వేది ప్రక్రియల సాధనకు కృషి చేయాలన్నారు. ప్రాథమిక విద్య పూర్తయ్యేలోపు విద్యార్థులు తప్పనిసరిగా చదవగలగాలని, అందుకోసం ఉపాధ్యాయులకు బోధనా ప్రణాళికలు, పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర పరిశీలకులు ఎస్.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్ఎం రాజమొగిలి, రామారావు, రమ, సంగమేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ ప్రకాశ్ కుమార్, చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఎంఈఓ గుగులోత్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో పడమటనర్సాపురం, జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఎస్.దుర్గాప్రసాద్, ఆర్.శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.
ఇల్లెందురూరల్: ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ అన్నారు. ఇందులో భాగంగా సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన తొలిమెట్టు శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ టీవీఆర్ స్వామి, కాంప్లెక్స్ హెచ్ఎం నాగేశ్వరరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు చేయూతనివ్వండి


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న దివ్యాంగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దివ్యాంగులకు అన్ని విధాల చేయూతనివ్వాలని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ కలెక్టర్‌ను కోరారు. ప్రియాంక అలాను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాలలో రాణిస్తామన్నారు. మేడి ప్రవీణ్, కాటి నాగేశ్వరరావు, కళాబాబురెడ్డి, గట్ల రమేష్, సున్నం కరుణాకర్, సుధాకర్, మౌలానా, కోటి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: నెహ్రూనగర్‌కు చెందిన దారా బాలకృష్ణ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండటంతో కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కె.నరేశ్ ఆర్థిక సహాయం అందించారు. మూడేళ్ల బాలుడు వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని వెల్ఫేర్ సంఘం సభ్యులు బుధవారం ఎస్ఐ నరేశ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం రూ.10వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

5న స్పాట్ అడ్మిషన్లు

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో మొత్తం 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

రాస్తారోకో, బంద్‌లు నిషేధం

పాల్వంచ: రాస్తారోకో, బంద్‌లు చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బంద్‌లు, రాస్తారోకోలు చేసిన వారి వివరాలు సేకరిస్తున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 44 మంది విద్యార్థులకు తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోటు బుక్స్‌ను దాతలు బాచిన సురేంద్ర బాబు దంపతులు పంపిణీ చేశారు. కొల్లు నాగేశ్వరరావు, కేశవరావు, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి నిధులివ్వండి

పాల్వంచరూరల్: బంఢ్రుగొండ గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ వగ్గెల పద్మ బుధవారం ఎంపీడీఓ అప్పారావును కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. వీధిలైట్లు, బ్లీచింగ్, మంచినీటి సమస్య, పారిశుద్ధ్య పనుల నిర్వహణ చేయలేకపోతున్నామన్నారు.

ప్రవేశాలు ప్రారంభం

జూలూరుపాడు: 2023–2024 విద్యాసంవత్సరానికి ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జూలూరుపాడు ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గురుమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల పోస్టర్లను మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ వెంకట్ విడుదల చేశారు. హెచ్ఎం ఆర్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ

ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో పలు ప్రభుత్వ పథకాల ద్వారా నిర్మిస్తున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ బాలరాజు బుధవారం తనిఖీ చేశారు. సర్పంచ్ భాగ్యమ్మ, కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. జూలూరుపాడుకు కేటాయించిన 108 వాహనాన్ని బుధవారం ఆయన పీహెచ్‌సీలో ప్రారంభించారు. మాట్లాడుతూ.. 108 అంబులెన్స్‌లు, 102 అమ్మఒడి వాహనాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు. స్థానిక పీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు అసెంబ్లీలో ప్రస్తావించి సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, వెంకటేశ్వర్లు, ప్రదీప్తి, రాజేందర్, శ్రీదేవి, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ గుండెపిన్ని తదితరులు పాల్గొన్నారు.